3 నుంచి డీసెట్ అభ్యర్థులకు రెండో విడత కౌన్సెలింగ్

అమరావతి, ఆంధ్రప్రభ: డీసెట్ -2025 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 3 నుంచి రెండో విడత కౌన్సిలింగ్ జరగనుంది. ఈమేరకు వెబ్ ఆధారిత ఐచ్చికాలను సమర్పించేందుకు అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌లో ఎంపికయిన వారికి ఈనెల 5న సీట్లు కేటాయిస్తారు. 8 నుంచి 10 వతేదీ వరకు ప్రభుత్వ డైట్ కళాశాలల్లో రీ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. ఈనెల 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని డీసెట్ సంచాలకులు గురువారం తెలిపారు.

సెకండరీ విద్యను బలోపేతం చేయాలి

అమరావతి, ఆంధ్రప్రభ: సెకండరీ విద్యను మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య సంచాలకులు, సెకండరీ విద్య చైర్మన్ జయరామరాజు అన్నారు. బోర్డు పునర్వ్యవస్థీకరణ అంశంపై మంగళగిరిలోని ద్యాభవన్‌లో గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సమావేశం ఆయన నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా జాతీయ విద్యాదానం- 2020 సిఫార్సులు, పాఠశాల విద్య జాతీయ స్థాయి సంస్కరణలకు సంబంధించి 12 కీలక అజెండాలపై చర్చించారు. బోర్డు పునర్వ్యవస్థీకరణ, జిల్లా పరీక్షా బోర్డుల ఏర్పాటు, డీజీఈ అధికారులను బోర్డు కార్యనిర్వాహక విభాగంగా నియ ించడంతో పాటు పలు ప్రతిపాదనలను ఆమోదించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కే.శ్రీనివాసులు రెడ్డి, ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహరావుతోపాటు ఆయాశాఖల అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 పోస్టుల్లో జెడ్పీ టీచర్లనే నియమించాలి

- నవ్యాంధ్ర ఉపాధ్యాయ సమాఖ్య విజ్ఞప్తి

అమరావతి, ఆంధ్రప్రభ: మండల విద్యాశాఖాధికారి పోస్టుల్లో జెడ్పీ టీచర్లనే నియమించాలని నవ్యాంధ్ర ఉపాధ్యాయ సమాఖ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ఉద్యోగాల్లో ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను నియమించడం సరికాదని సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు అన్నారు. ఎంఈఓ-1 పోస్టులన్నీ జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోకి వస్తాయని ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

విశ్రాంత ఉద్యోగుల జీవన రాజధాని విజయవాడ

- సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అతీరా ఎన్. కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ఉద్యోగుల విశ్రాంత జీవితం అధికంగా విజయవాడతోనే ముడిపడి వుంటుందంటూ సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అతీరా ఎస్.కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆటోనగర్‌లోని ఒక ఫంక్షన్ హాలులో సీజీఎస్టీ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా అతీరా ఎస్.కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ జీవితంలో ఎన్ని ప్రాంతాలు మారినా, చివరకు విశ్రాంత ఉద్యోగిగా విజయవాడలోనే అధికంగా స్థిరపడుతున్నారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల నివాస కేంద్రంగా విజయవాడ మారిందన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తన ఉద్యోగ జీవితంలో శాఖ అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించారని కొనియాడారు. విశ్రాంత జీవితంలో శ్రీనివాసరావు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు శాఖలో తన అనుభవాలు వెల్లడించారు. అనంతరం శ్రీనివాసరావును అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎం.నాగరాజు, గద్దె తిలక్, టి.వివేకానంద, సూర్యదేవర రమేష్ బాబు, రాజేశ్వరరావు, పి.వి.సత్యనారాయణ, ఎన్.ఎస్ నగేష్ బాబు, నవీన్ రాజు, ఆర్.పి.పి.కుమార్, శ్రీలక్ష్మి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలను 11వ తేదీతో ముగించాలి

అమరావతి, ఆంధ్రప్రభ: ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలను ఈనెల 11తో ముగించాలని ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృతికాశుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, ఆదర్శ జూనియర్ తోపాటు అన్ని ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రవేశాల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అందరి విద్యార్థుల వివరాలను యూడైస్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

మొయినాబాద్‌లో చిక్కిన చిరుత

హైదరాబాద్,ఆంధ్రప్రభ క్రైంబ్యూరో : హైదరాబాద్ వాసులకు పది రోజుల పాటు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మొయినాబాద్ ఎకోటిక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బోనులో బుధవారం అర్ధరాత్రి చిరుత చిక్కినట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఈ చిరుతను నల్లమల్ల అడవిలో వదిలిపెట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర శివారులోని మంచి రేవుల, గోల్కొండ, మూసీ పరివాహన ప్రాంతాలతో పాటు మృగవని పార్క్ గ్రేహౌండ్స్ పరిసరాల్లో చిరుత సంచారం జనాలను భయాందోళనకు గురి చేసి విషయం విదితమే. ఈ నేపథ్యంలో చిరుతను బం ధించేందుకు 8 ట్రాప్ కెమెరాలు, 6 బోనులను అటవీశాఖ అధికారులు ఏర్పా టు చేసినా చిక్కకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టిన విషయం విదితమే.

మహిళల ఫ్రీ జర్నీకి ఆర్టీసీ రెడీ!

- ఐదు రకాల బస్సుల్లో వర్తింపు
- 6న కేబినెట్‌లో విధివిధానాలు ఖరారు
- సిబ్బందికి జోరుగా శిక్షణ
- టిమ్స్, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు
- జీరో ఫేర్ టిక్కెట్‌ల జారీ పరిశీలన
- సమీక్షించిన ఉన్నతాధికారులు

అమరావతి, ఆంధ్రప్రభ: మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ సన్నద్ధం అవుతోంది. ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో మహిళ ఉచిత ప్రయాణం కోసం జీరో ఫేర్ టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఇప్పటికే ఆర్టీసీ టిమ్స్ (టిక్కెట్ ఇష్యూయింగ్ మిషన్), ఇతర సాఫ్ట్‌వేర్‌లో ఐటీ విభాగం మార్పులు చేసింది. ఇదే సమయంలో ఉచిత ప్రయాణం కోసం బస్సులు సిద్ధం చేస్తున్న అధికారులు.. మరో వైపు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కోసం స్త్రీశక్తి పథకంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ..ఈ నెల 6న జరిగే మంత్రివర్గ సమావేశంలో అధికారిక నిర్ణయం తీసుకోవచ్చని అధికారులు చెపుతున్నారు.

ఉచిత బస్సు పథకం అమలుతో రాష్ట్రప్రభుత్వంపై ఏటా రూ.2వేల కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. ఖర్చు ఎంతైనా వెనుకడుగు లేదంటూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆర్టీసీ బస్సుల్లో మహి ళలకు ఉచిత ప్రయాణం పథకం ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకంపై దృష్టిసారించారు. పథకం అమలులోని రాష్ట్రాల్లో ఆర్టీసీ అధికారులు పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత మంత్రివర్గ ఉపసంఘం కూడా వివిధ రాష్ట్రాల్లో పర్యటించి పథకం విధివిధానాలు, ప్రభుత్వంపై పడే భారం వంటి అంశాలపై సమగ్ర నివేదికను ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు నాయుడు పలుమార్లు కసరత్తు చేసి ఆగస్టు 15 నుంచి అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఐదు రకాల బస్సుల్లో అనుమతి

మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మహిళలకు పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కలిపించనున్నారు. ఇందులో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఉచిత బస్సు పథకం అమలులో ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇదే సమయంలో ఆర్టీసీ సిబ్బంది ఏ విధంగా వ్యవహరించాలనే దానిపై ఈ నెల 14వ తేదీ వరకు శిక్షణ ఇస్తారు. ఇప్పటికే రీజినల్ మేనేజర్లస్థాయిలో శిక్షణ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్టీసీ సాఫ్ట్‌వేర్‌లో సైతం పలు మార్పులు చేశారు. మరో వైపు టిమ్స్‌లో జీరో ఫేర్‌టిక్కెట్ జారీకి అవసరమైన మార్పులు చేశారు. బస్సుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకొని టిక్కెట్ల జారీ సులభతరం చేశారు. తద్వారా రద్దీ ఎంతున్నప్పటికీ డ్రైవర్లు, కండక్టర్లు వెనువెంటనే టిక్కెట్లను జారీ చేస్తారు. ప్రయాణికులు ఎక్కిన వెంటనే దిగాల్సిన స్టేజీని కొట్టి ఎనిమిది ప్రెస్ చేయడంతో టిక్కెట్టు జారీ అవుతుందని అధికారులు తెలిపారు.

ఒకే కుటుంబం నుంచి ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలు ప్రయాణిస్తే ఒకే టిక్కెట్టు జారీ చేయ నున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీరో ఫేర్‌టిక్కెట్టుపై పథకం పేరుతో పాటు ప్రయాణ దూరం, అందుకు అయ్యే ఛార్జీ, ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలు ప్రింట్ చేసి ఉంటా యి. డ్రైవర్, కండక్టర్ల గుర్తింపు నంబర్లతో పాటు బస్సు నంబర్, డిపో ఉంటుంది. తద్వారా ఎంత మొత్తం తమకు ప్రభుత్వం రాయితీ ఇచ్చిందనే విషయం ప్రయాణికులకు వెంటనే తెలిసి పోతుంది.

ఉన్నతాధికారుల సమీక్ష..

మరో 15 రోజుల్లో పథకం అమలు కానున్న నేపథ్యంలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లోని ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు గురువారం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో సమావేశమై సమీక్షించారు. మహిళలకు ఉచిత ప్రయాణంపై తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సదుపాయాలను మెరుగు పరచాలని ఆదేశించారు. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకొని డ్రైవర్లు సహా అవసరమైన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి జిల్లాలకు వర్తింప చేయనున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా చేయాలనే మహిళల నుంచి వినతులు వస్తున్న నేపథ్యంలో మరోసారీ సీఎం అధికారులతో సమీక్షించనున్నారు. ఆ తర్వాత 6న జరిగే కేబినెట్ సమావేశంలో పథకం విధి విధానాలతో పాటు పేరు, రాష్ట్రవ్యాప్తమా? జిల్లాకే పరిమితమా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వనున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం వలన ఏటా రూ.రెండు వేల కోట్లు భారం పడనుంది. ఈ మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు చెపుతున్నారు.

షెల్ కంపెనీల గుట్టేమిటి?

- సిట్ దూకుడు.. ముంబయికి వెళ్లిన దర్యాప్తు బృందం
- వరుణ్ నుంచి కీలక సమాచారం సేకరణ
- మరోవైపు పోలీసుల అదుపులో ఏ48 సుజనా బెహ్రాన్
- హైదరాబాద్ నుంచి విజయవాడ తరలింపు
- విచారిస్తున్న దర్యాప్తు అధికారులు
- దర్యాప్తు పురోగతిని డీజీపీకి వివరించిన సిట్ చీఫ్
- తదుపరి కార్యాచరణపై సుదీర్ఘ చర్చ
- త్వరలో మరిన్ని కీలక అరెస్టులు
- ఆ.. రూ.11కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేయండి
- ఏసీబీ కోర్టు ఆదేశం
- మరికొందరికి త్వరలో ఈడీ నోటీసులు
- మరికొద్ది రోజుల్లో అదనపు ఛార్జిషీట్ దాఖలు

అమరావతి, ఆంధ్రప్రభ: వైసీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక అంశంపై దృష్టి సారించింది. మద్యం ముడుపులను షెల్ కంపెనీలకు తరలించిన వైనాన్ని దాని వెనుక దాగి ఉన్న గుట్టును ఇక విప్పనుంది. ఇందుకోసం సిట్ ఓ ప్రత్యేక బృందం ముంబయికు వెళ్ళినట్లు తెలుస్తోంది. కేసులోని 40వ నిందితుడు వరుణ్ పురుషోత్తంను అదుపులోకి తీసుకున్న సిట్ అతని నుంచి కీలక సమాచారం రాబట్టి క్రమంలో హైదరాబాద్ శివారులో అట్టపెట్టెల్లో దాచి ఉంచిన రూ.11 కోట్లను స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు.. ఇప్పుడు అతను ఇచ్చిన మరింత సమాచారంతో ముంబైలోని పలు షెల్ కంపెనీలకు మద్యం డబ్బులు మళ్లించేందుకు నిందితులు ఏర్పాటు చేసిన ట్లు గుర్తించింది. ఈ మేరకు ముంబై లోనూ విచారణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంబైలో ఉన్న అన్ని షెల్ కంపెనీలను పరిశీలించి రిపో ర్టు తయారు చేసి సిట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ షెల్ కంపెనీలను కేవలం మద్యం ముడుపులు మళ్లించడం కోసం ఏర్పాటు చేసినట్లు సిట్ అధికారులు ఇప్పటికే తమ విచారణలో గుర్తిం చారు. దీంతో లిక్కర్ కేసులో షెల్ కంపెనీలను కూడా నిందితులుగా చేర్చారు. ముంబై తనిఖీల్లో కీలక ఆధారాలు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అదుపులో ఉన్న వరుణ్ పురుషోత్తంను రెండోరోజు కూడా అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

అదుపులో ఏ 48 సుజన బెహ్రాన్

ఇక లిక్కర్ కేసులో క్రమేణా అరెస్ట్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 48 మంది నిందితులను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న సిట్ 12 మందిని అరెస్ట్ చేసింది. మరో 12 మంది అరెస్ట్ కోసం కోర్టు నుంచి వారెంట్ తీసుకుంది. విదేశాల్లో ఉన్న తొమ్మిది మందిలో ఒకరైన వరుణ్ పురుషోత్తంను ఇప్పటికే అదుపులోకి తీసుకుని 11 కోట్లు సీజ్ చేసింది. ఇక తాజాగా 48వ నిందితుడు సుజన బెహ్రాన్‌ను సిట్ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లిక్కర్ ముడుపుల తరలింపు వ్యవహారంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి అనుచర గణంలోని సభ్యుడైన్ సుజన బెహ్రాన్ పాత్ర కూడా కీలకంగా గుర్తించిన సిట్ అతన్ని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించినట్లు సమాచారం. మరింత కీలక సమాచారం కోసం సుజనను సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

డీజీపీతో సిట్ చీఫ్ కీలక భేటీ

కాగా లిక్కర్ కేసు దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం చీఫ్, విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో భేటీ అయ్యారు. మద్యం స్కాంపై తాజా వివరాలను, దర్యా ప్తులోని పురోగతిని డీజీపీకి వివరించారు. సీజ్ చేసిన రూ.11 కోట్ల వ్యవహారంతో పాటు జగన్‌కు సమన్లు జారీ చేసే అంశంపైనా చర్చించినట్లు సమాచారం.

రూ. 11 కోట్లు డిపాజిట్‌పై కోర్టు ఉత్తర్వులు

ఇదిలావుండగా వరుణ్ సమాచారం మేరకు హైదరాబాద్‌లో సీజ్‌చేసిన రూ.11 కోట్లకు సంబంధించి సిట్ కోర్టులో మెమో దాఖలు చేసింది. ఈమేరకు నగదును కోర్టు ముందు ఉంచింది. దీంతో లిక్కర్ కేసులో సీజ్ సొమ్మును బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని ఎసిబి కోర్టు ఆదేశించింది. విజయవాడ మాచవరం శాఖ ఎస్‌బిఐ బ్యాంకులో డిపాజిట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. సీజ్ అయిన రూ.11 కోట్ల డబ్బును 2 ఏళ్ల కాలపరిమితి డిపాజిట్ చేయాలని పేర్కొంది. కోర్టు ఆదేశాలతో బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసేందుకు సిట్ చర్యలు చేపట్టింది.

అదనపు ఛార్జిషీటు దాఖలుకు సన్నద్ధం

కాగా మద్యం కేసులో అదనపు ఛార్జిషీటు దాఖలు చేసేందుకు సిట్ సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 300 పేజీలతో ప్రాథమిక చార్జిషీటును దాఖలు చేసిన సిట్ రానున్న పది రోజుల్లోగా అదనపు అభియోగ పత్రం సమర్పించనుంది. ప్రాథమిక ఛార్జి షీటులో లిక్కర్ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల రిమాండ్ రిపోర్టు, వాంగ్మూలాలతోపాటు విచారణ లో వెల్లడించిన అంశాలు, పలువురి వ్యక్తుల పేర్లు, వారి ప్రస్తావన మాత్రమే పొందుపర్చగా అదనపు ఛార్జిషీటులో దర్యాప్తు పురోగతితోపాటు మరింత కీలక సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమం లోనే తొలి ఛార్జిషీట్‌లో జగన్ పేరు ప్రస్తావించి వదిలేసిన సిట్ రెండో ఛార్జిషీట్‌లో ఆయన్ను నింది తుడిగా చేర్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమా చారం. ఈ నేపథ్యంలో అంతిమ లబ్దిదారుగా సిట్ భావి స్తున్న జగన్‌కు సమన్లు జారీ చేసేందుకు సిద్ధమవు తున్న ట్లు ప్రచారం జరుగుతోంది. మరో నలుగురు పాత్ర బయ టపడిందని, వారిపై పక్కా ఆధారాలు ఉన్నా యని వారిని ఈ కేసులో కీలకంగా చూపుతూ ఛార్జిషీటు లో పేర్కొననున్నట్లు తెలుస్తోం ది. అదనపు చార్జిషీట్‌లో ఉండబోయే నలుగురు కీలక వ్యక్తులు ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో ఎఫ్ఐ ఆర్‌లో ఆ నలుగురితో నిందితుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రంగంలోకి దిగిన ఈడీ రూ.11 కోట్లకు సంబంధించి వివరాలు సిట్ నుంచి సేకరించిన మీదట దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. 11 కోట్లు సీజ్ చేసిన వ్యవహారంలో మరికొందరికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

తదుపరి దర్యాప్తు మాత్రమే చేయండి

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం కేసులో దర్యాప్తు అధికారికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ఆరోపణలు ఎదుర్కొంటున్న డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు మాత్రమే పరిమితం కావాలని దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. మొదటి నుంచి దర్యాప్తును ప్రారంభించడానికి వీలులేదని అలాగే పునర్విచారణ కూడా చేయరాదని స్పష్టం చేసింది. సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతినిస్తూ రాజమండ్రి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఈనెల 22న ఇచ్చిన ఉత్తర్వులను ఎమ్మెల్సీ అనంతబాబు హైకోర్టులో ఇటీవల సవాల్ చేసిన విషయం తెలిసిందే. తదుపరి దర్యాప్తు పేరుతో దర్యాప్తు అధికారి పునర్ దర్యాప్తు ప్రారంభించి వేధింపులకు గురి చేసే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతబాబు పిటిషన్‌పై ఇప్పటికే విచారించిన న్యాయస్థానం దర్యాప్తు విషయంలో స్పష్టత ఇస్తామని ప్రకటించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మళ్ళీ మొదటి నుంచి దర్యాప్తు, పునర్విచారణ చేసేందుకు వీలు లేదని, తదుపరి దర్యాప్తు మాత్రమే చేయాలని దర్యాప్తు అధికారిని ఆదేశించారు. కాగా అనంతబాబు తరపున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదనలు వినిపించారు.

రామచంద్రయాదవ్ కరేడు వెళ్లేందుకు రేపటిలోగా నిర్ణయం తీసుకోండి

- డీజీపీ, నెల్లూరు ఎస్పీలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తలపెట్టిన రైతులకు సంఘీభావ కార్యక్రమానికి అనుమతి విషయమై ఆగస్టు 2వ తేదీనాటికి నిర్ణయం తీసుకోవాలని డీజీపీ, నెల్లూరు జిల్లా ఎస్పీలను హైకోర్టు ఆదేశించింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసే ఇండోసోల్ పరిశ్రమ కోసం ప్రారంభించిన భూ సేకరణ ప్రక్రియకు వ్యతిరేకంగా రైతులకు సంఘీభావం తెలియచేసేందుకు తనను కరేడు గ్రామానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, తన స్వేచ్ఛను అడ్డుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ రామచంద్ర యాదవ్ గురువారం హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. పిటిషరన్ తరపున సీనియర్ న్యాయవాది వైవీ రవి ప్రసాద్, న్యాయవాది పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. కరేడు పర్యటనకు అనుమతి కోరుతూ పోలీసులకు వినతి పత్రం సమ ర్పించినప్పటికీ ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది ఏ జయంతి వాదనలు వినిపిస్తూ పిటిషనర్‌పై ఇప్పటి వరకు 36 కేసులున్నాయని, తన పర్యటన ద్వారా రాకపోకలకు ఆటంకంతోపాటు శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కరేడులో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఇరుపక్షాల వాదనల అనంతరం కరేడు వెళ్లేందుకు అనుమతి కోరుతూ పిటిషనర్ సమర్పిం చిన వినతిపై ఆగస్టు 2లోగా నిర్ణయం తీసుకోవాలని డీజీపీ, నెల్లూరు ఎస్పీని ఆదేశిస్తూ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు.

రేవంత్‌రెడ్డి ఊరట

ప్రజాప్రతినిధుల కోర్టులోరెండు కేసులు కొట్టివేత..

హైదరాబాద్,ఆంధ్రప్రభ క్రైంబ్యూరో : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజాప్రతినిధుల కోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై నల్గొండ, కొడిపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను కేసులను ప్రజా ప్రతినిధుల కోర్టు గురువారం కొట్టివేసింది. రేవంత్‌రెడ్డి 2021లో టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో ఆయనపై ఆందోళనలు, నిరసనల సందర్భంగా ఈ కేసులు నమోదయ్యాయి. రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేస్తూ ర్యాలీలు నిర్వహించడం, అనుమతులు లేకుండా బహిరంగ సభలు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి ఆరోపణలతో అప్పటి పాలక పక్షం ఫిర్యాదులు దాఖలు చేసింది. ఈ కేసులకు సంబంధించి జులై 26న నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వం తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించగా రేవంత్ రెడ్డి తరపు న్యాయవాదులు తమ క్లయింట్ నిర్దోషిత్వాన్ని రుజువు చేయడానికి బలమైన వాదనలు, ఆధారాలను సమర్పించారు. ఇరు పక్షాల వాదనలను విన్న అనంతరం, న్యాయస్థానం కేసును జులై 31వ తేదీకి వాయిదా వేసింది.

చొరబాటుదారులా? శరణార్థులా?

- రొహింగ్యాల గురించి సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: రొహింగ్యాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వారంతా శరణార్థులా? లేక చొరబాటుదారులా? అన్నదే పెద్ద ప్రశ్నగా ఉందని పేర్కొంది. ముందుగా దీనిపై స్పష్టత వస్తేగానీ, ఇతర సమస్యలు పరిష్కారం కావని వ్యాఖ్యానించింది. ఒకవేళ రొహింగ్యాలు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా? అని ప్రశ్నించింది. రొహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులా? కాదా? అలా అయితే వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి.. ఒకవేళ వారు అక్రమ వలసదారులైతే, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటు దారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా? కోర్టులు ఎలాంటి షరతులు విధిం చొచ్చు అని సుప్రీం ధర్మాసనం పిటిషనర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఇందుకు న్యాయ వాది బదులిస్తూ, రొహింగ్యాల నిర్బంధమే కీలకాం శమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని కోర్టుకు విన్నవించారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ, రొహింగ్యాలపై దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాలుగా విభజించి విచారణ చేపడతామని తెలిపింది. ఇకపై ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది.

భీమిలి తీరంలో నేహారెడ్డి అక్రమ నిర్మాణం

రూ.17.45 కోట్ల జరిమానాకు సిఫార్సు

- బాధ్యులనుంచి ఆ మొత్తం వసూలు చేయాలి
- మూడునెలల్లోగా మిగిలిన నిర్మాణాలు తొలగించాలి
- లేదంటే జరిమానా రెట్టింపు
- హైకోర్టుకు నివేదించిన పర్యావరణ నిపుణుల కమిటీ
- ఆ వివరాలు మీడియాకు వెల